క్లుప్తంగా

అష్టైశ్వర్యాలకు మహాలక్ష్మి హోమం

ఖమ్మంగాంధీచౌక్: అష్టైశ్వర్యాల కోసం నగరంలోని శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న శ్రీ శాస్తా దేవస్థానం(అయ్యప్ప ఆలయం)లో శుక్రవారం శ్రీ మహాలక్ష్మి హోమాన్ని నిర్వహించారు. దేవస్థానం 38వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అష్టైశ్వర్యాలు సంప్రాప్తిస్తాయని నమ్మకంతో కేరళకు చెందిన తంత్రులు, పూజారులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చిల్లంచర్ల రాధాకృష్ణ, కార్యదర్శి రాయపూడి వెంకటరమణ, కోశాధికారి పసుమర్తి రంగారావు తదితరులు పూజలో పాల్గొనగా.. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్ సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ కారణంతో శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ ఉంటుందని ఏఈ క్రాంతిసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదులాపురం, తెల్దారుపల్లి, పెదతండా, గుర్రాలపాడు, మద్దులపల్లి, పొన్నేకల్, తల్లంపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సెడార్ వ్యాలీ స్కూల్ ఆధ్వర్యాన సదస్సు

ఖమ్మం సహకారనగర్: అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యాన పిల్లల పెంపకంపై నేడు(శనివారం) అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు హార్వెస్ట్ స్కూల్ కరస్పాండెంట్ పి.రవిమారుత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని పార్క్‌స్ట్రీట్(గొరిల్లా పార్క్)లో సాయంత్రం ఆరు గంటలకు మొదలయ్యే సదస్సులో క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ కలిదిండి కనకదుర్గ ముఖ్యవక్తగా పాల్గొంటారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


ఓటర్ చైతన్య బైక్ యాత్ర

ఖమ్మంరూరల్: ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ కాపలాదారుడే, సమర్థులకు ఓటు, అరాచకంపై వేటు అంటూ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఓటర్ చైతన్య బైక్ యాత్ర చేపట్టారు. మహబూబాబాద్‌లో ప్రారంభమై యాత్ర శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లిలోని మారెమ్మ తల్లి ఆలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా దేశ భవిష్యత్ బాగుండాలన్నా, యువతకు ఉపాధి అవకాశాలు కావాలన్నా, విలువలతో కూడిన సమగ్ర ప్రభుత్వం ఏర్పాటు కావాలన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌గౌడ్, సహజ, రణధీర్, రాకేష్, ఎల్లమ్మ, లక్ష్మయ్య, సురేష్, ఆశా తదితరులు పాల్గొన్నారు.

టౌన్-2 ఏడీఈగా నాగమల్లేశ్వరరావు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం టౌన్-2 విద్యుత్ ఏడీఈగా క్వాలిటీ కంట్రోల్ ఏడీఈ నాగమల్లేశ్వరరావుకు ఆ శాఖ ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఏడీఈగా పనిచేస్తున్న రమేష్ సెలవులో ఉండడంతో దాదాపు నెల రోజుల పాటు ఆయన ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న కళాకారులు

ఖమ్మంగాంధీచౌక్: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతున్న ఖమ్మం నగరానికి చెందిన పేద ప్రజా కళాకారుడు సాదు ఇజ్జగిరికి ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి శుక్రవారం రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. రవి అందించిన ఈ ఆర్థిక సాయాన్ని సహచర కళాకారులు బోగా గిరి, సుధాకర్, అజయ్‌లు ఇజ్జగిరికి అందివ్వగా.. వివిధ విభాగాలకు చెందిన కళాకారులు రవిని అభినందించారు.

'ఫాసిస్టు బీజేపీని గద్దె దించాలి'

తిరుమలాయపాలెం: హిట్లర్ తరహా ఫాసిస్టు విధానాలను అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించి, ఇండియా కూటమిని బలపర్చాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని దమ్మాయిగూడెంలో జరిగిన పార్లమెంటు ఎన్నికల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేయడంతో పాటు కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతుందని, అలాంటి బీజేపీని ప్రధాన టార్గెట్‌గా చేసుకుని ప్రజాస్వామిక లౌకిక శక్తులు దాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హన్మంతరావు, గోకినపల్లి సరోజిని, సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఎడ్లపల్లి నవీన్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

'కొత్త' బంగారు లోకం!



నగరంలోని ఓ జ్యూయలరీ షోరూంలో నగల కొనుగోళ్లు

అక్షయ తృతీయ సందర్భంగా జోరుగా పసిడి విక్రయాలు

- కళకళలాడిన బంగారం దుకాణాలు
- షోరూంల్లో కొత్త డిజైన్లు, ఆఫర్లు
- ధర పెరిగినా వెనుకాడని పసిడిప్రియులు

ఖమ్మంగాంధీచౌక్: అక్షయ తృతీయ సందర్భంగా శుక్రవారం బంగారం కొనుగోళ్లు జోరుగా సాగాయి. పూర్వీకుల నుంచి అక్షయ తృతీయను కలిసొచ్చే రోజుగా భావించడంతో కనీసం గ్రాము బంగారమైనా కొనాలని కొనుగోళ్లకు బారులుదీరారు. దీంతో బంగారం దుకాణాలు, షోరూంలు పసిడి కొనుగోళ్లతో కిటకిటలాడాయి. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా బంగారం విక్రయాలు జోరుగా సాగగా.. ప్రధానంగా నగరంలోని గాంధీచౌక్, కమాన్ బజార్, కస్బా బజార్, వైరారోడ్‌లలో పసిడి ప్రియులతో కళకళలాడాయి. సాధారణంగా జిల్లాలో రోజుకు రూ.4కోట్ల నుంచి రూ.5 కోట్ల మేరకు బంగారు నగల వ్యాపారం ఉంటుండగా.. అక్షయ తృతీయ సందర్భంగా రూ.30 కోట్లకు పైగా కొనుగోళ్లు జరిగాయని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నారు.

మగువలు ఆకట్టుకునేలా డిజన్లు..

పసిడి ప్రియుల మనోభావాలకు అనుగుణంగా వివిధ ప్రాంతాల నుంచి భిన్నమైన డిజైన్లను జ్యూయలరీ షోరూంలు అందుబాటులో ఉంచాయి. మగువుల మనసును గెలుచుకునేలా ట్రెండ్‌కు తగ్గట్టుగా కలకత్తా, రాజ్‌కోట్, ముంబయి, హైదరాబాద్, చెన్నై, గుజరాత్, కోయంబత్తూర్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి భిన్నమైన మోడళ్ల తెప్పించి విక్రయించారు. కెంపులు, పచ్చలు, అన్‌కట్స్, పచ్చివర్క్, అన్‌సెట్ డైమండ్, వడ్డాణాలు, బ్రాస్‌లెట్లు, హాత్‌పూల్, పాపిడ బిల్లలు, నాన్‌తాడులు, జడలు, గాజులు, హారాలు, నక్లెస్, ఉంగరాలు, చెవుదిద్దులు భిన్నమైన డిజైన్లు కలిగిన ఆభరణాలను విక్రయించారు.

రద్దీగా పసిడి దుకాణాలు..

అక్షయ తృతీయ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి రాత్రి వరకు నిరంతరాయంగా దుకాణాలు మహిళలతో కళకళలాడాయి. పసిడి ధర పెరిగినా కొనుగోళ్లకే ప్రాధాన్యం ఇచ్చారు. 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.73,309గా పలుకగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.67,000లుగా ఉంది. విక్రయాలను దృష్టిలో ఉంచుకొని జ్యూయలరీ దుకాణాల యజమానులు ఆభరణాలు దగదగలాడేలా, ఆకర్షణీయంగా లైటింగ్ ఏర్పాటు చేశారు.



నగలను సరి చూసుకుంటున్న పసడి ప్రియులు

బంగారం అంటే ఇష్టం..



బంగారం అంటే ఇష్టం. ప్రతీ అక్షయ తృతీయకు ఎంతో కొంత కొనుగోలు చేస్తాం. తద్వారా మేలు జరుగుతుందని నమ్మకం. అయితే, ఈ అక్షయ తృతీయకు ఊహించని విధంగా బంగారం ధర పెరిగింది. అయినా ఆనవాయితీ ప్రకారం జూకాలు కొనుగోలు చేశాం.

– వేముల సునీత, శ్రీనివాసనగర్

మొదటి నుంచి నమ్మకం..



అక్షయ తృతీయ రోజున బంగారం, ఆభరణాలు కొనుగోలు చేస్తే మంచిదనే నమ్మకముంది. ఈసారి అక్షయ తృతీయ సందర్భంగా నా పుట్టిన రోజు కూడా కలిసొచ్చింది. దీంతో అమ్మానాన్నలు నగలు కొనివ్వడానికి ముందుకు వచ్చారు. ఇష్టమైన బ్రాస్‌లెట్ కొనుగోలు చేశా.

– ఎడ్లపల్లి మానస, జెడ్పీసెంటర్

కొనుగోళ్లకు ఆసక్తి..



అక్షయ తృతీయ సందర్భంగా బంగారు ఆభరణాల విక్రయాలు కొంతమేర పుంజుకున్నాయి. కొందరు ఆనవాయితీగా అక్షయ తృతీయ రోజున కొంటే, మరికొందరు సాధరంగా తమకు ఇష్టమైన నగలు కొన్నారు. ఇందులో కొందరు ముందుగానే ఆర్డర్లు ఇచ్చి కొనుగోలు చేశారు. – అర్వపల్లి అశోక్‌కుమార్, మహేశ్వర జ్యూయెలరీ, ఖమ్మం

కాంగ్రెస్ వచ్చాకే కరువు కాటకాలు

ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



రఘునాథపాలెం: మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



కామేపల్లి: ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం: గత పదేళ్ల కాలంలో నగరంలో మంచినీటి కొరత లేదని, ఎక్కడా వాటర్ ట్యాంకర్లతో నీటిని తెచ్చుకునే పరిస్థితి లేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నీటి ఎద్దడితో పాటు కరువు కాటకాలు సంభవించాయని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం నగరంలోని త్రీటౌన్, వన్‌టౌన్ ప్రాంతాల్లో రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లు, రఘునాథపాలెం మండలం చింతగుర్తి, కొర్లబోడుతండా, రాంక్యతండా గ్రామాల్లో ఉపాధి హామీ పనుల ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను అనేక అభివృద్ధి పథకాలతో ఖమ్మంను నంబర్‌వన్‌గా నిలబెట్టానని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని సమస్యలే తలెత్తుతున్నాయన్నారు. గ్రామాలను జీపీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అబద్ధపు ప్రచారం చేసి కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి సంక్షేమ పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని, కేసీఆర్ కొంచం పక్కకు జరిగితే మళ్లీ గ్రామాలు వెనుకబడే పరిస్థితికి వచ్చాయన్నారు. పెన్షన్ పెంచలేదని, రూ.500లకు గ్యాస్ కాలేదని, తులం బంగారం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి ఇచ్చిన హామీలను నేరవేర్చుకోవాలంటే ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌జేసీ కృష్ణ, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి, రాంమోహన్, మక్బూల్, దాదే అమృతమ్మ, తోట ఉమారాణి, పల్లా రోజ్‌లీనా, రఘునాథపాలెం మండల అధ్యక్షుడు వీరునాయక్, మాజీ సర్పంచ్ మెంటెం రామారావు, హమాలీ, మాజీ ఎంపీపీ శాంత, నాయకులు మద్దినేని వెంకటరమణ, తాతా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం: మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

కామేపల్లి: బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దులపల్లి, జాస్తిపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న ప్రదేశంలో మహబూబాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపును కాంక్షిస్తూ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. మోసపూరిత కాంగ్రెస్‌ను నమ్మొద్దని, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. పదేళ్లలో బీజేపీ దేశాన్ని ఉద్ధరించింది ఏమీ లేదన్నారు. కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని గుర్తు చేస్తూ.. కారు గుర్తుపై ఓటు వేసి మాలోత్ కవితను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంతోటి అచ్చయ్య, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, సామా మోహన్‌రెడ్డి, వడియాల కృష్ణారెడ్డి, కాత్రాల రాంబాబు, మల్లెంపాటి శ్రీనివాసరావు, నునావత్ సూర్య, భట్టు శంకర్, గుంపెనపల్లి అనంతరాములు, పాల్గొన్నారు.

నామా గెలుపునకు కృషి చేయాలి..

తిరుమలాయపాలెం: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపునకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీఆర్‌ఎస్ మండల నాయకుడు, తిరుమలాయపాలెం మాజీ సర్పంచ్ కొండబాల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లా అభివృద్ధిలో గెలుపుతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గొలుసు ఉపేందర్ ఆధ్వర్యాన పలు కుటుంబాలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో చీమ భూపాల్, మండల లింగయ్య, మండల వీరయ్య, గడ్డం సాయి, అలేటి సాయి, అలేటి రమేష్, అలేటి మురళీ, జాల సందీప్, దొడ్డ గోపి, పాల్గొన్నారు.

లౌకిక వాదానికి ప్రజలు ఓటు వేయాలి



సదస్సులో మాట్లాడుతున్న మనోహర్‌రాజు

ఖమ్మంమయూరిసెంటర్: 18వ పార్లమెంట్ ఎన్నికల్లో లౌకికవాదాన్ని గెలిపించాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందని టీపీటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి వి.మనోహర్‌రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నగర సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం గడిచిన పదేళ్లుగా మతతత్వ అజెండాతో ప్రజలను విభజిస్తున్నారని, విచ్ఛిన్నకర శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బీజేపీ కాలంలో లౌకిక విధానాలు రోజురోజుకు సన్నగిల్లుతుందన్నారు. మోదీ సరైన మెజారిటీ సాధించిననాడు లౌకిక రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి ఇండియాను ఒక మత రాజ్యాంగంగా మార్చాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్, ఝాన్సీ, శోభ, కె.శ్రీనివాస్, ఆజాద్, చందు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి వినూత్న ప్రచారం



కుండలతో ప్రచారం చేస్తున్న జోగ్రామ్ నాయక్

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి: ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి, హైకోర్టు ప్రభుత్వ మాజీ న్యాయవాది తేజావత్ జోగ్రామ్‌నాయక్ తన గుర్తు అయిన కుండలతో ఖమ్మం, నేలకొండపల్లిలో వినూత్న ప్రచారం చేశారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘాన్ని బలపరిచిన జోగ్రామ్‌నాయక్ శుక్రవారం మద్దతుదారులతో కలిసి నగరంలో భారీ ప్రదర్శన చేపట్టారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో నాలుగు లక్షల వరకు లంబాడీ సామాజిక వర్గ ఓట్లు ఉన్నాయని, వారిని చైతన్యపరిచేందుకు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. తన కుండ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. కాగా, నేలకొండపల్లి మండల కేంద్రంలో గిరిజన సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. బస్కినాయక్, సునీల్ నాయక్, సేన నాయక్, వీరు, బాసు, కుమార్, బంజారా సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పేదరిక నిర్మూలనకు కృషి చేస్తానని స్వతంత్ర ఖమ్మం ఎంపీ అభ్యర్థి అంతోని సురేష్ అన్నారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి స్థలంలేని ప్రతీ కుటుంబానికి 100 గజాల స్థలం ఇచ్చేలా పార్లమెంట్‌లో తన గళం విప్పుతానన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మల్లయ్య యాదవ్, రామారావు, శ్రీనివాస్, మల్లేశ్, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో టీపీజేఏసీ ప్రచారం

ఖమ్మంలీగల్: గత పదేళ్లలో మోదీ ప్రభుత్వ పాలనలో జరిగిన విధ్వంసాలను వివరించే కరపత్రాలను జిల్లా కోర్టులో శుక్రవారం తెలంగాణ పీపుల్ జేఏసీ ఆధ్వర్యాన న్యాయవాదులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పీపుల్స్ జేఏసీ జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి విజయ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, నిరుద్యోగం, అధిక ధరలు, లౌకిక ప్రజాస్వామిక స్ఫూర్తిని దెబ్బతీసిందని ఆరోపించారు. 2014 ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయకుండా తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడంతో పాటు దేశ సంపదను బడా వ్యాపారవేత్తలకు కట్టబెట్టి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం కోసం కుట్ర చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు విప్లవకుమార్, చల్లా శంకర్, మీసాల వెంకటేశ్వర్లు, కొల్లి నాగేశ్వరరావు, విద్యాసాగర్, వెంకటేశ్వర్లు, జానీమియా, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలోనూ వచ్చేది కాంగ్రెస్సే..



ఖమ్మంవన్‌టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న మద్ది శ్రీనివాసరెడ్డి

ఖమ్మం వన్‌టౌన్/ ఖమ్మం మయూరిసెంటర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలోనూ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పలువురు నేతలు పేర్కొన్నారు. ఈనేపథ్యాన శుక్రవారం నగరంలోని కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలలో 5 గ్యారంటీలను ఇప్పటికే అమలుచేసి ప్రజల హృదయాలను గెలుచుకుందని, దాదాపు 66 లక్షల మంది రైతులకు రైతు భరోసా సాయం అందించిందన్నారు. బీసీ జనగణన చేసి జనాభా ప్రాతిపదికన కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లను ఇస్తుందని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకుడు చోటేబాబా, నాగండ్ల శ్రీనివాసరావు, పోటు అభిలాష్‌చౌదరి, మేడా వెంకట్రావు, బానోత్ వినోద, మోజెస్ క్రిష్టోఫర్, శాంతారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, సీపీఎం బలపరుస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరుతూ బైపాస్ రోడ్డు కూరగాయలు మార్కెట్‌లో సీపీఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మూడవసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి దేశంలో సంక్షోభం వచ్చే అవకాశం వుందని, మతోన్మాద బీజేపీని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కల్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, టి.విష్ణు, టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, బీరప్ప, వెంకన్నబాబు, డి.వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డికే మద్దతు



పుష్పగుచ్ఛం ఇస్తున్న రవికుమార్

నేలకొండపల్లి/ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూక హనుమంతరావు, బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ శుక్రవారం చెప్పారు. నేలకొండపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హనుమంతరావు, ఖమ్మంలో రఘురాంరెడ్డిని కలిసిన సందర్భంగా రవికుమార్ తమ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న వలసలు



నేలకొండపల్లి: కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో పొంగులేటి ప్రసాద్‌రెడ్డి

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం/ఖమ్మంవన్‌టౌన్/నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యాన కాంగ్రెస్‌లో వలసల పర్వం కొనసాగుతోంది. నగరంలోని బాలపేటతండాకు చెందిన సుమారు 70 కుటుంబాలు వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ జిల్లా నాయకుడు మానుకొండ రాధాకిషోర్ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా.. 8వ డివిజన్ అధ్యక్షుడు గొడుగు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ భూక్యా బాషా, మందనపు భాస్కర్‌రావు, సతీష్, వెంకటపయ్య, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రఘునాథపాలెం మండలం పరికలబోడు తండాకు చెందిన సుమారు 120 కుటుంబాలు బీఆర్‌ఎస్ నుంచి భూక్యా చందర్ రాథోడ్, తేజావత్ మంగీలాల్ ఆధ్వర్యాన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాల దుర్గాప్రసాద్, నగర పార్టీ అధ్యక్షుడు జావీద్‌ల సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బానోత్ శ్రీను, ధరావత్ దేవా.,ధరావత్ మోతీలాల్, తేజావత్ రంజిత్, భూక్య బిక్కు, భూక్యా గాంధీ, మూడు మోహన్ తదితరులు ఉన్నారు. అలాగే నగరంలోని 58వ డివిజన్‌కు చెందిన బండి మాధవరావు, తంగిరాల శ్రీకాంత్‌ల ఆధ్వర్యాన రమణగుట్ట నుంచి శీలం వివేక్, గోగుల నాగేంద్రబాబు, సతీష్, సతీష్‌గౌడ్, గోపిలతో పాటు 350 మంది యువకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సమక్షంలో కాంగ్రెస్ చేరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, చోటేబాబా, గౌస్‌పాషా తదితర నాయకులు పాల్గొన్నారు. అంతేకాక నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరుకు చెందిన న్యాయవాది దేవరశెట్టి రాము బీఆర్‌ఎస్ లీగల్ సెల్ నుంచి కాంగ్రెస్ లీగల్ సెల్‌లోకి చేరగా.. మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దండా సుధాకర్ కండువా కప్పి స్వాగతించారు. అలాగే బైరవునిపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా.. కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా.. ఆర్.రమేష్, ఆకుల నాగేశ్వరరావు, కె.రాంబాబు, అఖిల్, వి.వెంకన్న, గిరిధర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడుతూ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

హిందూ ధర్మాన్ని కాపాడే వారికే వీహెచ్‌పీ మద్దతు



మాట్లాడుతున్న బొడ్డు కృష్ణ

ఖమ్మంగాంధీచౌక్: హిందూ ధర్మాన్ని కాపాడే వారికే విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) మద్దతు ఉంటుందని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి బొడ్డు కృష్ణ తెలిపారు. శుక్రవారం రాత్రి నగరంలోని వీహెచ్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఎన్నికల సమయాన రాజకీయ లబ్ధి కోసం, ఓట్ల కోసం పలు రాజకీయ పార్టీలు మైనారిటీ భజన చేస్తున్నాయని, రామ మందిరాన్ని నిర్మించింది రాజకీయ లబ్ధి కోసం కాదని, దాన్ని ట్రస్టు నిర్మించిందన్నారు. సనాతన హిందూ ధర్మాన్ని రక్షించే రాజకీయ పార్టీలకు ప్రజలు కూడా అండగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బోనాల రామకృష్ణ, కార్య అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గత పాలకులు పట్టించుకోలేదు..

బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు



ఖమ్మం మామిళ్లగూడెం: ఓబీసీ మోర్చా ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న వినోద్‌రావు

నేలకొండపల్లి/ ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మాన్ని గత పాలకులు పట్టించుకోలేదని, కాంగ్రెస్ అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, తనకు ఒక్క అవకాశం ఇస్తే ఖమ్మం అభివృద్ధికి పాటుపడతానని బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. శుక్రవారం నేలకొండపల్లిలో జరిగిన రోడ్‌షో, ఖమ్మంలో బీజేపీ జిల్లా నాయకుడు రుద్రప్రదీప్ ఆధ్వర్యాన 24వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం, ఖమ్మంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యాన ఏర్పాటు ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గత, ప్రస్తుతం పాలకులు ఖమ్మం అభివృద్ధిని పట్టించుకోకుండా విస్మరించారని, తనను గెలిపిస్తే కేంద్ర నిధులు తీసుకొచ్చి అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. బీసీలకు పెద్దపీట వేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తాయని, ఖమ్మంలో కాషాయం జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమాల్లో కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి రవికుమార్, చావా కిరణ్, రాష్ట్ర నాయకుడు శీలం పాపారావు, నేలకొండపల్లి మండల అధ్యక్షుడు కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్, షర్ఫుద్దీన్, మెహినుద్దీన్, నాయకులు కొండబాల కరుణాకర్, ఆరెకట్ల కొండలరావు, డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు, నారాయణరావు, వాసుదేవరావు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, విద్యాసాగర్, అల్లిక అంజయ్య, సత్యనారాయణ, నర్సింహారావు, దొంగల సత్యనారాయణ, జిల్లా వెంకటేశ్వర్లు, అల్లిక అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం..

ఖమ్మంరూరల్: మండలంలోని మంగళగూడెంలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ఆయన సతీమణి తాండ్ర వీనీలారావు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, కె.సుదర్శన్, కన్నేటి కోటయ్య, బానియానాయక్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు మాదిగలు కృషి చేయాలి

తిరుమలాయపాలెం: బీజేపి ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు గెలుపునకు మాదిగలు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతిరాల నాగభూషణం పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ హామీ ఇచ్చారని, వర్గీకరణ బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాసరెడ్డి, మండల కార్యదర్శి నల్లగట్టు శ్రీనివాస్, మహేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు మహేష్, వంగూరి రామారావు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.